క్లుప్తంగా

19న గిరిజన ఆదివాసి సమ్మేళన సభ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శంకర్ నాయక్

తిరుపతి కల్చరల్: గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 19న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే గిరిజన ఆదివాసీ సమ్మేళన సభకు గిరిజన, ఆదివాసీలందరూ పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు, గిరిజన విద్యార్థి సమాఖ్య జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పద్మావతి అతిథి గృహం వద్ద గిరిజన ఆదివాసీ సమ్మేళన సభ పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ.శంకర్రావు, కేరళ ఐజీ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్ వంటి ప్రముఖులు హాజరు కానున్నారని తెలిపారు. అలాగే గిరిజన సంస్కృతీ సంప్రదాయాలతో గిరిజన కళా బృందాల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య తెలంగాణ అధ్యక్షుడు దినేష్ నాయక్, తేజ నాయక్, హనుమంత్ నాయక్ పాల్గొన్నారు.

ఎస్వీయూ రెగ్యులర్ వీసీగా బీసీలకు ఇవ్వాలి

– ఆత్మీయ సమావేశంలో బీసీ నేతల డిమాండ్



సమావేశంలో ఐక్యత చాటుతున్న బీసీ నేతలు

తిరుపతి కల్చరల్: ఎస్వీ యూనివర్సిటీ రెగ్యులర్ వీసీ పదవిని బీసీలకు కేటాయించాలని బీసీనేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఓ తిరుపతిలోని ఓ ఫంక్షన్ హాల్లో బీసీ కులాల ఐక్య వేదిక నేతలు బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ కె.నారాయణస్వామి మాట్లాడుతూ, బీసీల మద్దతుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమానికి ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం సరికాదని విమర్శించారు. దేశ, రాష్ట్ర జనాభాలో 60 శాతంపైగా ఉన్న బీసీలకు నామినేటెడ్ పదవులు కల్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా నియమించబోయే రెగ్యులర్ వీసీ పదవులలో బీసీలకు సగం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగార్జున ఆచారి, బీసీ సంఘర్షణ సమితి గౌరవాధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అమర్నాథ్, బీసీ ఎంప్లాయీస్ జిల్లా నేతలు సురేష్, బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నారాయణగౌడ్ వివిధ అంశాలపై మాట్లాడారు. సమావేశంలో జంగమ సేవా సమితి జిల్లా అధ్యక్షురాలు వసంత, బీసీ ఉద్యోగుల సంఘ నేత గోపాల్, గాండ్ల సంఘం అధ్యక్షుడు ఉమాపతి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, జంగమసంఘ నేతలు పాల్గొన్నారు.

సాహిత్యంపై పెరిగిన ఆసక్తి



పుస్తక ప్రదర్శనకు హాజరైన ప్రముఖ రచయితలు, సాహితీ వేత్తలు

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా రచయితల సంఘం రెండు రోజుల పాటు ప్రకాశం రోడ్డులో నిర్వహించిన సగం ధరలకే పుస్తకాల విక్రయ ప్రదర్శన ఆదివారం ముగిసింది. దీనికి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో తల్లిదండ్రులు, విద్యార్థులు, సందర్శించి పుస్తకాలు అంచనాలకు మించి కొనుగోలు చేయడం హర్షణీయమని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధరప్రసాద్ తెలిపారు. ప్రధానంతా విద్యార్థులు తెలుగు సాహిత్యంతో పాటు ఆంగ్ల సాహిత్యంపై కూడా ఆసక్తి ప్రదర్శించడం నిర్వాహకులకు సరికొత్త ఉత్సాహాన్నిచ్చింది. ఈ ప్రదర్శనలో రచయితలు తిరువాయపాటి రాజగోపాల్, భూమన్, డాక్టర్ మౌని, జిల్లేళ్ల బాలాజీ, ఆచార్య కోసూరు దామోదర నాయుడు, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, మల్లేశ్వరరావు, తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ మస్తానమ్మ, నెమిలేటి కిట్టన్న, దయాకర్, శేషుకుమార్, శశిధర్‌రాజు పాల్గొన్నారు.

● ఫ్లెక్సోత్సాహం..!



రుయాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రిని ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఫ్లెక్సీ ఫ్రీ జోన్‌గా ప్రకటించారు. బయట వ్యక్తులు ఇష్టారాజ్యంగా రుయాలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికారుల దృష్టికి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే దీనిని ఉల్లంఘిస్తూ పారిశుద్ధ్య పనులను సబ్ కాంట్రాక్టర్ నిర్వహిస్తున్న వ్యక్తికి పారిశుద్ధ్య కార్మికుల్లో ఓ వర్గం అత్యుత్సాహం ప్రదర్శించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై స్పందించిన రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, ఏఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ ఆ ఫ్లెక్సీలను సెక్యూరిటీ సిబ్బందితో తొలగించారు. రుయాలో ఎవరైనా బయటి వ్యక్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగ్గుకో ముచ్చట!



ఇంటి గుమ్మం ముందు ముగ్గు భారతీయ సాంప్రదాయానికి మెట్టుగా నిలుస్తోంది ముగ్గు. పురాణ, ఇతిహాసాలలోనూ, రుగ్వేదంలోనూ ముగ్గుల ప్రాధాన్యత గురించి వివరించారు. మహిళలు వేసే ప్రతి ముగ్గుకూ ఓ ముచ్చట ఉంటుందని, ముగ్గుశైలిని చూసి మగువ మనస్సు తెలుసుకోవచ్చని ముగ్గు శాస్త్రం చెబుతోంది. ముగ్గు వెనుక పరమార్థాలే కాకుండా బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ఇళ్ల ముంగిట్లో చల్లే పశువుల పేడ కల్లాపి, సున్నంతో వేసే ముగ్గులు క్రిమికీటకాల సంహారిణిగా పనిచేస్తాయి. రోగ నిరోధకశక్తి పెరిగి, మహిళలకు శరీర వ్యాయామంగానూ ఉపయోగపడుతుంది. సంక్రాంతి సందర్భంగా రంగవల్లులపై ప్రత్యేక కథనం.



- మహిళల సృజనాత్మకతకు నిదర్శనం రంగవల్లులు
- ముగ్గుశైలిని చూసి మగువ మనస్సు తెలుసుకోవచ్చంటున్న ముగ్గు శాస్త్రం
- ముగ్గుల అల్లికలో రహస్య భాష, రుగ్వేదం, పురాణాలలోనూ ప్రస్తావన
- ఇళ్ల లోగిళ్లలోకి ఆరోగ్యం, లక్ష్మీదేవిని ఆహ్వానించడమే ముగ్గుల ప్రత్యేకత
- సంక్రాంతి ముగ్గులకు ప్రత్యేక విశిష్టత

ముగ్గులను ఎక్కడ ఏమని పిలుస్తారంటే..

కేరళ	పువిదల్
తమిళనాడు	కోలం
కర్ణాటక	రంగోలి
మహారాష్ట్ర	సంస్కార్ భారతి
బిహార్	అరిపాన్
రాజస్థాన్	మందన
గుజరాత్	సాథియా
ఉత్తరప్రదేశ్	చౌక్‌పూర్ణ
బెంగాల్	అల్పన
తెలుగు రాష్ట్రాలలో	రంగవల్లులు, ముగ్గులు



శిల్పారామంలో నిర్వహించిన పోటీలలో ముగ్గులు వేస్తున్న మహిళలు

తిరుపతి సిటీ: సంక్రాంతి రోజు వేసే ముగ్గుల్లో సాధారణ రోజుల్లో వేసే ముగ్గుల కంటే ప్రత్యేక విశిష్టత ఉంటుంది. వాటిల్లో గొబ్బెమ్మలు, రంగులు, బంతిపూలు, రేగిపండ్లు, గరిక, నవధాన్యాలు, సూర్యచంద్ర ఆకృగుతులు, భోగి పండుగ విశిష్టతను తెలిపే సందేశం ఉంటుంది. రంగవల్లులలో కనిపించే పలు రకాల ఆకృతులు ప్రకృతి నుంచి వచ్చినవే. భోగభాగ్యాల కోసం భోగి పండుగ రోజున వసే పద్మాలు, కుండల ముగ్గులు, సంక్రాంతి రోజున వేసే గొబ్బెమ్మ ముగ్గులు, కనుమ రోజు వేసే సూర్యచంద్ర ఆకృతులు, గోవుల ప్రతిమ ముగ్గులు మూడు రోజుల పాటు ప్రతి ఇంటి ముంగిళ్లలో కళకళలాడుతుంటాయి.

రంగవల్లుల అల్లికలో రహస్య భాష

కళాత్మక జీవనానికి పునాదైన 64 కళల్లో ముగ్గులు వేయడం ఓ కళగా చెబుతుంటారు. రంగవల్లులను పవిత్ర రేఖలుగా భావించి, ఏ దుష్ట శక్తీ ఇంటి గుమ్మాన్ని తొక్కదు అనే నమ్మకం పూర్వీకుల నుంచి వస్తోంది. రంగవల్లుల అల్లికలో రహస్య భాష దాగి ఉందని పురోహితులు చెప్పారు. వాత్సాయనుడు తన కామసూత్ర మహాకావ్యంలో ప్రేమ ముగ్గుల గురించి ప్రస్తావించారు. ప్రేయసీ ప్రియులకు మాత్రమే వాటిలో ఉండే రహస్య భాష అర్థమవుతుందిని రాశాడు. యజ్ఞయాగాదుల్లో రంగవల్లులకు ప్రత్యేక స్థానం ఉంది.

పూర్వ కాల సాంప్రదాయాలల్లో పురోహితులు రంగవల్లి వ్రతాన్ని నిర్వహించేవారు. ముగ్గులలో తంత్రశక్తి దాగి ఉంటుందని తంత్ర శాస్త్ర నిపుణుల నమ్మకం. ఇంటి ఎదుట రంగవల్లులు ఉంటే ఆ గృహంలోని వారంతా సంప్రదాయబద్ధమైన జీవితం గడుపుతున్నారనే ముద్ర పడుతుంది.

సందర్భాన్ని బట్టి ముగ్గులు

ముగ్గురకం	సందర్భం
పీట ముగ్గు	వివాహాది శుభకార్యాలలో
కుండల, గరిక ముగ్గు	భోగి పండుగ రోజున
గొబ్బెమ్మ	సంక్రాంతి పండుగ రోజున
నవధాన్యాలు, గోప్రతిమ	కనుమ పండుగ రోజున
శ్రీ చక్ర	ఆలయాల్లో
సకల దీపాల రంగోలి	దీపావళి
సర్ప	నాగలచవితి, నాగపంచమి
నక్షత్రాల ముగ్గు	గృహ ప్రవేశాల సమయం

ముగ్గుల పోటీలకు విశేష స్పందన

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. తమ సృజనాత్మకతను చాటుతూ పలువురు రంగు రంగులతో ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి ఏఓ ఖాదర్‌వల్లీ బహుమతులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ,15వ తేదీ వరకు ప్రతి రోజూ శిల్పారామంలో సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తామని, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ రీతిలో నిర్వహిస్తున్న ఈ సంబరాల్లో నగర ప్రజలు తమ కుటుంబ సభ్యులతో పాల్గొనాలని కోరారు.



ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళకు బహుమతి అందజేస్తున్న ఏఓ ఖాదర్‌వల్లీ

లక్ష్మీదేవిని ఆహ్వానించినట్లే



భక్తి భావాలతో మహిళలు ఇంటి ముంగిట వేసిన ముగ్గుకు లక్ష్మీదేవి ప్రసన్నమవుతుంది. సంక్రాంతి ముగ్గులు ప్రతి ఇంటి ముంగిట వేసి, నిష్ఠతో పూజలు చేస్తే, ఆ ఏడాది సకల సంపదలు, అష్ట ఐశ్వర్యాలతో తులతూగుతుందని ప్రగాఢ విశ్వాసం.

– ప్రసన్న కుమారి, గృహిణి, తిరుపతి

అలంకరణే కాదు...ఆరోగ్య సందేశం



ముగ్గులు వేయడం అలంకరణ కోసమో... ఇరుగుపొరుగువారి మెప్పుకోసమో కాదు. సున్నపు పిండి, పసుపు, కుంకుమ, పశువుల పేడ నేచురల్ యాంటీ బయాటిక్స్‌గా పనిచేస్తాయి. సంక్రాంతికి సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడంతో వాతావరణంలో మార్పులు సంభవిస్తాయి. ఈ నేపథ్యంలో ఇళ్లలోకి క్రిములు ప్రవేశించకుండా పెద్దలు ముగ్గులు వేయడం అనాదిగా ఒక సంప్రదాయంగా పాటిస్తున్నారు.

– మీనాక్షి, ప్రైవేటు కళాశాల అధ్యాపకురాలు, తిరుపతి

ముగ్గుల కిక్కే వేరప్పా..!



సంక్రాంతి వచ్చిందంటే చాలు మా వీధిలో యువత అంతా ఒకచోట చేరి ముగ్గుల డిజైన్లపై చర్చించుకుంటాం. మూడురోజులు మాకు నిద్ర ఉండదు. రాత్రి 12గంటల వరకు ముగ్గుల వేయడమే సరిపోతుంది. రంగోలీలు వేసి సెల్ఫీలు తీసుకుంటాం. ఫోటోలు తీసి మా క్లాస్‌మేట్స్‌కు, తోటి యువతకు షేర్ చేస్తాం. అందులో ఉండే ఆహ్లాదం, ఆనందం, కిక్ వేరేలా ఉంటుంది.

– శిరీష, విద్యార్థిని, తిరుపతి

'ట్రెక్కింగ్'తో సందడి



జలపాతం వద్ద సందడి చేస్తున్న ట్రెక్కర్స్

తిరుపతి కల్చరల్: తిరుపతి అడ్వెంచర్ అడిక్ట్స్ ట్రెక్కింగ్ గ్రూప్ 50 మందితో కలిసి రామాపురం సమీపంలోని పీవీ పురంలోనున్న అడవిలో సాహస, సరదాల ట్రెక్కింగ్ ఆదివారం ముగిసింది. ఈ ట్రెక్కింగ్‌లో బెంగళూరు, చెన్నై ట్రెక్కర్స్ సైతం పాల్గొని సందడి చేశారు. అడవిలోని జలపాతాలు, లోయలను సందర్శించి ఆదివారం రాత్రి తిరుపతికి చేరారు.

తపాలా పథకాలతో జీవితానికి భరోసా



మాట్లాడుతున్న కర్నూల్ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ఉపేందర్

తిరుపతి సిటీ: జీవితానికి భరోసా నిచ్చే పోస్టల్ బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూల్ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ వి.ఉపేందర్ కోరారు. ఆదివారం ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా తిరుపతి తపాలా శాఖ ప్రజలకు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ముఖ్యఅతిథిగా ఉపేందర్ మాట్లాడారు. గ్రామీణులకు ఉద్యోగులు, సిబ్బంది పోస్టల్ బీమాపై అవగాహన కల్పించాలని కోరారు. తిరుపతి జిల్లా పరిధి నుంచి సుమారు 400 మందికి పైగా ప్రజలు, ఉద్యోగులు అవగాహన సదస్సులో పాల్గొని కోటి రూపాయల ప్రీమియంతో బీమా సదుపాయాన్ని వినియోగించుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి డివిజనల్ సీనియర్ సూపరింటిండెంట్ బి.నరసప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ నాగా నాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.వసంత, అర్ముగం, నాగరాజు, రంజిత్, కృష్ణమూర్తి, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలతో సంక్రాంతి సంబరాలు

తిరుపతి కల్చరల్: తిరుపతి వినాయక నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలోఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గాలిపటాలు ఎగురవేయడంతో పాటు ప్రాచీన సంప్రదాయ క్రీడలైన బొంగరాలు, గోలీలాట, కబడ్డీ, కర్ర బిళ్ల వంటి ఆటలతో అలరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సామంచి శ్రీనివాస్, గుండాల గోపినాథ్‌రెడ్డి ,విజయకుమార్, వెంకటేష్ చెంగారెడ్డి, రెడ్డిబాబు, కీర్తి వెంకయ్య ,మల్లారపు వాసు, గోపి, ప్రసాద్, వరప్రసాద్, సుబ్రమణ్యం, జీవీఎస్.ప్రసాద్, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

నగరంలో మొదలైన సంక్రాంతి కోలాహలం

తిరుపతి కల్చరల్: సంక్రాంతి పండుగ ఒక రోజు ముందే ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో సంక్రాంతి సందడి మొదలైంది. వరుస పండుగలు పురస్కరించుకుని వస్త్ర, బంగారు దుకాణాలతో పాటు వివిధ వ్యాపారులు కొనుగోళ్లపై ప్రత్యేకంగా ఆఫర్లు ఇవ్వడంతోగాంధీ రోడ్డు, తీర్థకట్టవీధి, ఇందిరా కూరగాయల మార్కెట్, తీర్థకట్ట వీధి జన సందడితో కిక్కిరిశాయి. పలు రకాల రంగుల పొడులు, ముగ్గురాళ్లు సైతం మహిళలు కొనుగోలు చేయడం కనిపించింది.

భోగిమంటలు

ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రతి ఇంటి ముంగిట, వీధులు, ప్రధాన కూడళ్లలో భోగిమంటల సందడి నెలకొంది. వయోబేధం లేకుండా పాత వస్తువులతో ఇళ్ల ముందు భోగి మంటలు వేశారు. ఆనందోత్సాహాలతో సందడి చేశారు. తాతయ్యగుంట కూడలిలో తాతానగర్ యువజన విభాగం ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి సందడి చేశారు. కార్యక్రమంలో తాతయ్యగుంట ప్రజలు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, దొడ్డారెడ్డి మనోహర్‌రెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి, కేఎస్.రాజా, తిరుమలరెడ్డి, చెంగారెడ్డి, చాంద్ బాషా, రాజేష్, భాస్కర్‌రెడ్డి ,స్థానిక యువకులు పాల్గొన్నారు.



భోగిమంటలు వేస్తున్న తాతానగర్ యువజన విభాగం ప్రతినిధులు, ప్రజలు

కుటుంబ బంధాల ప్రతీక సంక్రాంతి

తిరుపతి కల్చరల్: భోగి, సంక్రాంతి, కనుమ వంటి వరుస పండుగలు కుటుంబ బంధాలకు ప్రతీకగా నిలుస్తాయని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. రాస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలను ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయనతో పాటు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం మాట్లాడారు. అనంతరం రాస్ ప్రాంగణంలో భోగి మంటలు వేసి పొంగళ్లు, గంగిరెద్దు ఆటలు, బుడబుక్కల వేషధారణలు, దేవర పాటలు,గొబ్బి పాటలు, గాలిపటాలు, కోడి పందాలు ప్రదర్శించి అలరించారు. పలువురు వికలాంగులకు వీల్ ఛైర్స్, సపోర్టింగ్ వాకర్, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ సహాయ కార్యదర్శి మమత, మహిళా వికాస్ అధ్యక్షురాలు సమత, ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు, రాస్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



వీల్‌చైర్, వాకర్ పంపిణీ చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఘనంగా పరుష పందాలు



పాకాల: మండలంలోని మద్దినాయన పల్లెలో ఆదివారం పరుష పందాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి సర్పంచ్ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ఎద్దులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన ఎద్దుల కొమ్ములకు రంగు రంగుల పలకలు కట్టి బరిలోకి దించారు. ఆ పలకలను, మరికొన్ని ఎద్దులకు కట్టిన బహుమతులను దక్కించుకునేందుకు యువకులు నువ్వా, నేనా? అని గుంపులుగా పోటీ పడ్డారు. తమ అభిమాన నాయకులు ఫొటోలతో కట్టిన పలకలు ఆకర్షణగా నిలిచాయి. ఈ పందాలను చూసేందుకు వచ్చిన జనంతో గ్రామం సందడిగా మారింది.

ఆక్రమణపై ఉక్కుపాదం

తిరుపతి తుడా: స్థానిక మున్సిపల్ ప్రకాశం పార్క్ వెనుక వైపు విజయ శ్రీ హోం స్టే భవన యజమాని నూతనంగా నిర్మించిన రహదారిపై ఐదు అడుగుల వరకు ఆక్రమించాడు. ఇంటి నుంచి కాలువ దాటి రోడ్డును సైతం ఆక్రమించి ర్యాంపును నిర్మించారు. దీనిపై సాక్షి కథనం ప్రచురించడంతో స్పందించిన మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ ఆక్రమ ర్యాంపును అధికారులు తొలగించారు.



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

యువతకు స్ఫూర్తి ప్రదాత వివేకానంద



తిరుపతి సిటీ: వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని అన్నమయ్య భవన్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను కల్చరల్ కో–ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. నిరాశ, నిస్పృహలకు లోనైనప్పుడు యువత వివేకానంద జీవిత చరిత్రను చదివితే స్ఫూర్తి కలుగుతుందన్నారు. అధ్యాపకులు మురళీధర్, రమేష్ బాబు, సరిత, గణేష్, రాంబాబు, కళ్యాణ్, ప్రకాష్, సుధాకర్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి: స్థానిక కొత్తపేటలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద విగ్రహానికి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారత దేశ సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని ఖండాంతరాలకు చాటిచెప్పిన వ్యక్తి వివేకానంద కీర్తించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్తపాటి వేణుగోపాల్ రెడ్డి, ఎంపీటీసీలు మాధవ రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, నాయకులు అగరాల దేవారెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, సోను, బండారు సుధాకర్, ప్రకాష్ రెడ్డి, మురగయ్య, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరిలో..



తిరుపతి మెడికల్‌కాలేజీ కూడలిలో..

మెడికల్ కాలేజీ కూడలిలో..

తిరుపతి గాంధీ రోడ్డు: తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాల కూడలిలోని స్వామి వివేకానంద విగ్రహానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించి పుష్పాంజలి ఘటించారు. హిందూ మత గొప్పదనాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేసిన స్వామి వివేకానంద దేశ చరిత్రలో మహనీయుడుగా నిలిచారని స్మరించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాశ్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్, నాయకులు వరప్రసాద్, జనార్ధన్ రెడ్డి, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

నృత్యం..మంత్ర ముగ్ధం



చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. మద్రాసుకు కళాబృందం ఆధ్వర్యంలో భరతనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శించారు. కళాకారులు వైష్ణవి, హాసిని, నంధికా, రాగవర్షిణి, యువనిక, రక్షిత, లాలిత్య, ప్రగతి, సహనా, హరివర్ధని, లింగేశ్వరి, తనుష్క, రక్షిత, కనిష్క, హన్షిక తమ నృత్యప్రదర్శనలతో మంత్రముగ్ధుల్ని చేశారు.

పేరూరు బాలసుబ్రమణ్యంకు సత్కారం



'పేరూరు'ను సత్కరిస్తున్న చిత్తూరు రచయితల సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన రచయిత పేరూరు బాలసుబ్రమణ్యంను చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఆదివారం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేతుల మీదుగా జ్ఞాపిక, శాలువతో ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా రచయితల సంఘం నిర్వాహకులు సహదేవ నాయుడు, వారి బృందం పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

అ'పూర్వ' సమ్మేళనం

తిరుపతి సిటీ: ఎస్వీ ఆర్ట్స్ కళాశాల 2001–2004 బ్యాచ్ డిగ్రీ పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తాము చదివిన తరగతుల్లో వెళ్లి జ్ఞాపకాల పేజీలు తిరగేశారు. తమ గురుదేవులను కలిసి ఆశీస్సులు పొందారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కామర్స్ హెచ్ఓడీ మల్లికార్జున రావు, అల్యూమిని అసోసియేషన్ ఉపాధ్యక్షులు అజ్మల్ బాషా, పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



క్లిక్..క్లిక్: ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వద్ద పూర్వ విద్యార్థులు